క్లుప్తంగా

స్పందనలో నాలుగు ఫిర్యాదులు



స్పందన కార్యక్రమంలో రైతు ఇచ్చిన వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు

పెదవేగి : ప్రజా సమస్యల పరిష్కారానికై స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పెదవేగి తహసీల్దార్ ఎస్ నాగరాజు అన్నారు. సోమవారం పెదవేగి తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం అన్ని శాఖల మండల అధికారుల సమక్షంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాలుగు ఫిర్యాదులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. పొలం సబ్ డివిజన్ చేయాలని రెండు ఫిర్యాదులు, దారి ఆక్రమణకు గురైందని పరిష్కరించాలని ఒక ఫిర్యాదు, నాభూమిని ఆన్‌లైన్ చేయాలని ఒక రైతు స్పందనలో ఫిర్యాదు చేశారని తహసీల్దార్ తెలిపారు.

నేడు దెందులూరు మండల సర్వసభ్య సమావేశం

దెందులూరు : దెందులూరు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి తెలిపారు. ఎంపీటీసీలకు, సర్పంచ్‌లకు అన్నిశాఖల మండలాధికారులు సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలన్నారు. మండలాధికారులు సమగ్రమైన సమాచారంతో సమావేశంలో పాల్గొనాలని కోరారు.

పెదపాడులో..

పెదపాడు: మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు పెదపాడు మండల ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి తెలిపారు. పెదపాడు మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులు పాల్గొనాలని ఆమె తెలిపారు.

కంటి సమస్యలపై నిర్లక్ష్యం తగదు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం : ఎంతో సున్నితమైన కంటికి సంబంధించిన సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు సంతోష్‌నాయుడు, కిరణ్మయి అన్నారు. సోమవారం గణపవరం సచివాలయం-3 పరిధిలోని బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా కంటి ఆరోగ్యానికి సంబంధించి తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహారం గురించి విద్యార్థులకు వివరించారు. 500 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 35 మంది విద్యార్థులకు కళ్లజోడు పడినట్లు ఆప్తమాలజిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, హెచ్‌ఎం అంబటి అనూరాధ, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ జలకళ రైతులకు వరం



వైఎస్సార్ జలకళ బోరు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్

దెందులూరు: వైఎస్సార్ జలకళ పథకం రైతుల పాలిట వరమని, రైతులందరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నటికి మరువరని గోపన్నపాలెం గ్రామ సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ అన్నారు. సోమవారం పంచాయతీ పరి ధిలోని కొత్తపల్లి గ్రామంలో వైఎస్సార్ జలకళ పథకంలో బోరు నిర్మాణాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ లు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, వైఎస్సా ర్‌సీపీ నాయకులు కొండేటి గంగధరబాబు, మాగంటి కృష్ణమోహన్, కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ ఏనుగు హేమసాగర్, మోర్ల సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆరుగురికి జరిమానా

భీమడోలు : మండల పరిధిలోని జాతీయ, రాష్ట్రీ య రహదారులపై మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఆరుగురు వాహన చోదకులను పోలీసులు సోమవారం భీమడోలు జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపర్చారు. జూనియర్ సివిల్ జడ్జి రిషిక్ ఆదిత్య ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారని ఎస్సై చావా సురేష్ కుమార్ తెలిపా రు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై పేర్కొన్నారు.

‘ఫ్యామిలీ డాక్టర్’కు మంచి ఆదరణ

పెదవేగి పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణిమ



అమ్మపాలెంలో అనారోగ్యంతో ఉన్న ఓ వృద్ధురాలికి వైద్యం అందిస్తున్న డాక్టర్ పూర్ణిమ

పెదవేగి : ఫ్యామిలీ డాక్టర్ విధానానికి ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తుందని పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి పి పూర్ణిమ చెప్పారు. సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా పెదవేగి పీహెచ్‌సీ పరిధిలోని అమ్మపాలెం పంచాయతీ సచివాలయంలో వైద్య శిబిరం నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని వారికి ఇంటి వద్దే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లలేని వారికి, నిరుపేదలకు ఫ్యామిలీ డాక్టర్ విధానం ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కోసం ప్రతి పీహెచ్‌సీలో ప్రభుత్వం ఇద్దరు డాక్టర్లను నియమించిందన్నారు. 104 మెబైల్ యూనిట్ తో సహా సిబ్బంది డాక్టర్‌తోపాటు ఆశావర్కర్లు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. పెదవేగి పీహెచ్‌సీ పరిధిలో 28 సచివాలయాల్లో టూర్ షెడ్యూలు ప్రకారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రదంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, పాలు, గుడ్లు, పంపిణీ తీరును తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్చమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి కృషి

ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు



అమ్మవారిని దర్శనం చేసుకుంటున్న ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

దెందులూరు : గాలాయగూడెంలోని శ్రీ అచ్చమ్మపేరంటాలమ్మ తల్లి ఆశీస్సులు పొందడం తమ అదృష్టంగా భావిస్తున్నామని అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఇడా చైర్మన్ మధ్యాహ్నపు ఈశ్వరి బలరాం, ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. సోమవారం గాలాయగూడెం శ్రీ అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి దర్శనానికి ప్రజాప్రతినిధులు విచ్చేశారు. తొలుత ఆలయ కమిటీ ప్రజాప్రతినిధులకు ఆలయ సాంప్రదాయంతో స్వాగతం పలికారు. ప్రజాప్రతినిధులు అమ్మవారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి జ్ఞాపికను ప్రజాప్రతినిధులకు అందచేసి ఘనంగా సత్కరించారు. దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డినాని, జడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, గ్రామ సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ సాంగా ప్రమీల వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తోట వెంకన్న, నాయకులు, కార్యకర్తలు, భక్తులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, పార్టీ నేతలు

భీమడోలు: స్వచ్ఛంద సేవల ద్వారా ప్రజలకు మేలైన సేవలందిస్తూ చైతన్య యువజన సంఘం సామాజిక స్ఫూర్తిని నింపే కార్యక్రమాలు మరవలేనివని భీమడోలు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్, సొసైటీ చైర్మన్ రావిపాటి సత్యశ్రీనివాస్ అన్నారు. భీమడోలు సొసైటీ కార్యాలయంలో సోమవారం చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నేత డా.పాము మాన్‌సింగ్ ఆధ్వర్యంలో సామాజిక స్పృహను చాటేలా రూపొందించిన నూతన క్యాలెండర్‌ను మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను చేస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్న చైతన్య యువజన సంఘం సేవాదృక్పథం అభినందనీయమన్నారు. మహిళలు, యువతకు వృత్తి నైపుణ్యాలపై శిక్షణ అందిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అన్ని విధాలుగా తమ వంతు కృషి చేస్తున్నారన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఉన్నత స్థితికి చేరుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు సవలం నాని, కిలపర్తి భాస్కరరావు, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, భీమడోలు గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, పోలసానిపల్లి మాజీ ఉప సర్పంచ్ అంబటి నాగేంద్ర ప్రసాద్, అంబర్‌పేట గ్రామ వైసీపీ అధ్యక్షుడు రామిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

దోసపాడులో ఆరోగ్యమాత ఉత్సవాలు



దోసపాడులో పరిశుద్ధ ఆరోగ్యమాత విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కొఠారు రామచంద్రరావు

దెందులూరు: ప్రతి ఒక్కరికీ చిన్ననాటి నుంచి ఆధ్యాత్మిక చింతన, సత్‌ప్రవర్తన, ప్రేమ, సేవా భావం కలిగి ఉండాలని ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. సోమవారం దోసపాడులో ఆర్‌సీఎం చర్చిలో 13వ పరిశుద్ధ మేరిమాత ఉత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. పోతునూరు పారిస్ క్రిస్ట్ ఫాదర్ డేవిడ్‌రాజు ప్రత్యేక దివ్యబలిపూజ నిర్వహించారు. తొలుత కొఠారు రామచంద్రరావు, జడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు,ఎంపీటీసీ పెద్దిశెట్టి రోహిణి మేరీమాత విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు కొఠారును సన్మానించారు. నాయకులు నిట్టా లీలానవకాంతం గంగరాజు, కామిరెడ్డి నాని హాజరయ్యారు.

చిన్న ఫార్ములాల సాధనతో గణితంపై పట్టు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గణితశాస్త్ర అధ్యాపకులు శివరామకృష్ణ

ఉంగుటూరు : చిన్న ఫార్ములాలు నేర్చుకోవడం ద్వారా గణితంపై పట్టు సాధించవచ్చునని ఏలూరు రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకులు డా.శివరామకృష్ణ అన్నారు. న్యూమరికల్ ట్రెండ్స్ అనే అంశంపై మూడు రోజుల కార్యక్రమం సోమవారం నారాయణపురం ఎస్‌ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభమైంది. ఈ సదస్సులో శివరామకృష్ణ న్యూమరికల్ పద్ధతిలో మెళుకువలను నేర్పించారు. న్యూటన్ ఫార్వర్డు, బ్యాక్ వర్డు, ఇంటర్ కౌయిలేషన్ ఫార్ములాలు మొదలైన అంశాలను విద్యార్థులకు విపులంగా వివరించారు. వారి చేత సాధన చేయించారు. గణిత శాస్త్రంలో చిన్న ఫార్ములాలు నేర్చుకోవడం ద్వారా అనేక పెద్ద చిక్కుముడులకు సమాధానాలు రాబట్టగలమని తెలియచేశారు. ఎస్ఏఎస్ ప్రభుత్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు అధ్యక్ష స్థానంలో మాట్లాడుతూ గణిత శాస్త్రంలో పట్టు సాధించడం ద్వారా అన్ని శాస్త్రాలలో పట్టు సాధించడం సులభమవుతుందన్నారు. కార్యక్రమంలో గణితశాస్త్ర అధ్యాపకులు డా.పి.బాబురావు, డా.కొండారవి వేదికను అలంకరించి మాట్లాడారు.

నాడు–నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి



సత్యవోలు హైస్కూల్‌లో నాడు- నేడు పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: మండలంలోని నాడు- నేడు పనులు త్వరగా పూర్తి చేయాలని పెదపాడు జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని సత్యవోలు గ్రామంలో జరుగుతున్న నాడు- నేడు పనులను పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న క్లాస్‌రూమ్ ఫ్లోరింగ్ పనులను పరిశీలించారు. పనులు త్వరితగా పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి తగు సూచనలు అందించారు. తొలుత సత్యవోలు గ్రామ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసారు. సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలను గౌరవించి మర్యాదపూర్వకంగా వారికి అవసరమైన సేవలను త్వరితగతిన అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

హిండెన్‌బర్గ్ నివేదికపై విచారణ చేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దేశంలో అదానీ ఆస్తులపై హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ విడుదల చేసిన నివేదికపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేసి విచారణ చేయాలని కాంగ్రెస్ ఏలూరు నగర అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు డిమాండ్ చేశారు. పీసీసీ పిలుపుమేరకు సోమవారం ఏలూరు నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి ఒన్‌టౌన్‌లోని స్టేట్‌బ్యాంక్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజనాల మాట్లాడుతూ బడా బాబులు దేశాన్ని దోచుకుతింటున్నారని, అంబానీ, అదానీలను పోషిస్తూ దేశ సంపదను అమ్మేస్తూ బీజేపీ ప్రభుత్వం దేశాభివృద్ధిని నిర్వీర్యం చేయడమే కాక ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని విమర్శించారు. అదానీ గ్రూప్ స్టాక్ మార్కెట్‌లో అక్కౌంటింగ్ మోసాలు చేస్తోందని, అడ్డగోలుగా షేర్లను పెంచుకుంటోందని, దీంతో దేశంలో రూ.10 లక్షల కోట్లకు పైగా మదుపరుల సంపద ఆవిరైపోయిందని వాపోయారు. దీనిపై సుప్రీం కోర్టు ధర్మాసనంతో విచారణ చేయించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దండుబోయిన చంద్రశేఖర్, ప్రతాప సుబ్రహ్మణ్య శర్మ, కొమ్మన సాంబశివరావు, ఉప్పు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నీటి వినియోగం తగ్గించాలి



అలుగులగూడెం సమావేశంలో మాట్లాడుతున్న ఏవో గద్దె రమేష్

దెందులూరు : రైతులంతా సాగులో నీటి నిల్వలు మోతాదు మేరకే అందించాలని, నీటిని అధికంగా వాడటం వల్ల భూసారానికి, దిగుబడి శాతం నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్, పార్టనర్స్ ఇన్ ప్రాసిపర్టీ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ మూర్తి అన్నారు. సోమవారం అలుగులగూడెంలో రైతులకు దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పామాయిల్ తోటలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో అతిథులు మాట్లాడుతూ వరిచేలల్లో తడి, పొడి పద్ధతుల్లో చేయడం ద్వారా భూసారం పెరగడంతో పాటు దిగుబడులు సంతృప్తికరంగా వస్తాయన్నారు. నీటి వినియోగం, సాగు పద్ధతులు, భవిష్యత్తులో నీటి కొరత, పొదుపుపై సుదీర్ఘంగా రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వ్యవసాయ కళాశాల (రాజమండ్రి) అధ్యాపకులు, విద్యార్థులు రైతులతో కలిసి ఆర్గనైజేషన్ ప్రతినిధులు మూర్తి, శ్రీలత, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు వరి పొలాన్ని పరిశీలించారు. రైతులు, ఆర్గనైజేషన్ సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

పెదపాడు : ఈ నెల 12 నుంచి 14వరకు జరిగే జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు వెళ్లే విద్యార్థులకు అప్పనవీడు మానవత సభ్యులు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జీ అజయ్ (డిస్కస్‌త్రో) పామర్తి రాహుల్‌సాయి(షాట్‌పుట్)లు బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగే పోటీలకు ఎంపికయ్యారు. వీరికి మానవత సంస్థ నుంచి రూ.10వేలను సోమవారం మానవత చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు చేతుల మీదుగా చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి



మేయర్ నూర్జహాన్ పెదబాబు దంపతులను సత్కరించిన పట్టణ సమాఖ్య అధ్యక్షులు

ఏలూరు టౌన్: ఏలూరు పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షులు, కమిటీ మర్యాదపూర్వకంగా ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబు దంపతులను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వారిద్దరిని ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకంతో పట్టణ సమాఖ్య అధ్యక్షులుగా ఎంపిక చేయడంపై అభినందనలు చెప్పారు. పట్టణంలోని మహిళా సంఘాల సమాఖ్య సభ్యులందరికీ అండగా ఉంటూ మహిళల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు దాసరి వరలక్ష్మి, టూటౌన్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎస్‌కే అమీనా అన్సారి, కమిటీ సభ్యులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సౌందర్యలహరి దీప పూజ



సౌందర్య లహరి దీప పూజలో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): 91వ రామకోటి మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యులు మౌనధ్యానం, భక్తిగీతాలపానలు, హరేరామ సంకీర్తనలు చేశారు. స్వామి వారికి సహస్రనామ పూజలు నిత్య హోమం చేసి నిత్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా సహస్రావధాని వద్దిపర్తి పద్మాకర్ గురు మహిమ అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. రాత్రి వాగ్దేవి సౌందర్యలహరి బృందం ఆధ్వర్యంలో 100 మందితో సౌందర్యలహరి దీప పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీప లక్ష్మీ స్తోత్ర పారాయణ చేశారు. తొలుత అర్చకులు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు చేయగా, రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పేకాట శిబిరంపై దాడి

ముగ్గురు వ్యక్తుల అరెస్టు

పెదపాడు: పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.3వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పెదపాడు ఎస్సై బీ నాగబాబు తెలిపారు. పెదపాడు మండలంలోని పాతముప్పర్రు గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పెదపాడు ఎస్సై తన సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేసారు. పేక ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రూ. 3వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైభవంగా వీరభద్ర స్వామి రథోత్సవం



కామవరపుకోటలో వీరభద్రస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కామవరపుకోట : వీరభద్రస్వామి కల్యాణోత్సవంలో భాగంగా శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఉదయం చొతన సెంటర్లో స్వామివారి త్రిశూల స్నానం, వసంతోత్సవం అనంతరం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని ముందుకు లాగారు. కామవరపుకోట పురవీధులలో అర్చకుల మంత్రాలు, మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, డీజే శబ్దాల నడుమ రథోత్సవం నిర్వహించారు. జీలకర్రగూడెం బౌద్ధరామ బృందం ప్రదర్శించిన కోలాటం, గుంటూరు వారిచే కర్ణాటక మహిళా వీర గాథ ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది, విజయవాడ వారిచే బేతాళ విచిత్ర వేషాలతో చొతన సెంటర్ నుంచి దుర్గ మహల్ మీదుగా గుర్రాల చెరువు వరకు తడికలపూడి ఎస్సై కె.వెంకన్న ఆధ్వర్యంలో భారీ బందోబస్తు మధ్య ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ రథోత్సవం సాగింది.

డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ పునర్ వ్యవస్థీకరణ



కళాశాల అభివృద్ధికి రూ.20 వేల చెక్కు అందిస్తున్న వెంకటేశ్వరరావు, కౌన్సిల్ సభ్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రణాళిక అభివృద్ధి కౌన్సిల్ (సీపీడీసీ)ను పునర్ వ్యవస్థీకరించినట్టు ప్రిన్సిపాల్, సీపీడీసీ చైర్మన్ జి.గిరిబాబు తెలిపారు. ఈ కౌన్సిల్‌లో డిగ్రీ కళాశాల అభివృద్ధికి స్థానిక పెద్దలను, నగరంలోని వివిధ రంగాల్లో నిష్ణాతులను, విద్యార్థుల తల్లిదండ్రులను, పూర్వ విద్యార్థులను, ప్రభుత్వ ఇంజినీర్‌ను భాగస్వాములుగా చేశామన్నారు. కళాశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన కౌన్సిల్ తొలి సమావేశంలో కళాశాల స్థితిగతులపై సభ్యులు చర్చించామని, కౌన్సిల్ కార్యదర్శిగా ఈ. రఘుబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధికి కౌన్సిల్ సభ్యుడు ఎల్.వెంకటేశ్వర రావు రూ.20 వేలు చెక్కు ప్రిన్సిపాల్‌కు అందజేశారు.

ఘనంగా వీరదుర్గా వ్రతాలమ్మ పంచమ మహోత్సవాలు

పెదపాడు: మండలంలోని వీరమ్మకుంట గ్రామంలో వీరదుర్గా వ్రతాలమ్మ తల్లి పంచమ మహోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా తయారు చేసిన వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమం, మ్యూజికల్ నైట్ ప్రోగ్రాం ఏర్పాటు చేసారు. 7న ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలపారు. 8న బుధవారం 5గంటల నుంచి అమ్మవారి భారీ ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

ఐటీడీఏ వద్ద ధర్నా

బుట్టాయగూడెం : 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఐటీడీఏలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు ఏ. రవి మాట్లాడుతూ 1/70 చట్టంపై సుప్రీంకోర్టులో వేశారని దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గిరిజనుల పక్షాన వాదనలు వినిపించాలని అన్నారు. ఆ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మల్బరీ సాగు విస్తరణకు ప్రత్యేక కృషి

బుట్టాయగూడెం : గిరిజన ప్రాంతంలో మల్బరీ తోటల సాగును పెంపొందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని పట్టు పరిశ్రమ అధికారి పైడా సత్యనారాయణ తెలిపారు. సోమవారం స్థానిక ఐకేపీ కార్యాలయం వద్ద మల్బరీసాగు విస్తరణపై వెలుగు అధికారులు, డ్వాక్రా సంఘాల మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మల్బరీసాగుపై డ్వాక్రా సంఘాలను కూడా అనుసంధానం చేసే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారని అన్నారు.

9న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ నెల 9వ తేదీన వేదిక నిర్వహించనున్నట్లు సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ బి. సత్యనారాయణ, ఈపీడీసీఎల్ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్‌ఆర్‌పేట విద్యుత్ భవన్‌లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల్లో సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, బిల్లులో పేరు మార్పిడి, సరఫరా పునరుద్ధరణలో ఇబ్బందులు, నిమంత్రికల మార్పిడి తదితరాలపై ఫిర్యాదులు అందిచవ్చని పేర్కొన్నారు. సీజీఆర్‌ఎఫ్ చైర్మన్, సభ్యులు హరిబాబు, పి.శ్రీనివాస్, బాలాజీ ప్రసాద్ పాండే పాల్గొంటారని తెలిపారు.